క్లుప్తంగా

వలంటీర్ల నియామకం



పెదపారుపూడి: మండలంలోని పెదపారుపూడి, నాగాపురం గ్రామాలకు వలంటీర్ల నియామక పత్రాలను ఎంపీపీ గోగం సురేష్ మంగళవారం అందజేశారు. పెదపారుపూడి గ్రామం నుంచి బొడ్డు సుజాత, నాగాపురం గ్రామం నుంచి సుస్మితలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈకార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ జాజుల చిన్నారి, మండల కన్వీనర్ గోళ్ళ సోమేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చీకుర్తి వరప్రసాద్, చిగురుపాటి శ్రీధర్, నాలి రాఘు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల జయంతి



గుడివాడ టౌన్: సినీ గాయకుడు ఘంటసాల 101వ జయంతి వేడుకలు స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగి అవిర్నేని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గుడివాడకు చెందిన ఘంటసాల సినీ గాయకుడే కాక కమ్యూనిస్ట్ భావజాలం కలిగిన వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి, ఎం.శ్రీనివాసరావు, నీలం మురళీకృష్ణారెడ్డి, పి.పూర్ణచంద్రరావు, పి.రజిని, టీజీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చెట్లు తొలగించిన ఫైర్ సిబ్బంది

గుడివాడ టౌన్: మిచాంగ్ తుపాను కారణంగా కురిసిన భారీ వర్షం, గాలులకు కొన్ని వృక్షాలు నేలకొరగగా లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వృక్షాలు నేలకొరగగా ఫైర్ సిబ్బంది వాటిని తొలగించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వగా నందివాడ మండలంలోని పలు శివారు గ్రామాల్లో రోడ్లపై భారీగా నీరు నిలిచింది.

పునరావాస కేంద్రానికి తరలింపు



కలిదిండి: పడమటిపాలెం గ్రామంలో లోతట్టు ప్రాంతంలో ఉన్న బాధితులను మంగళవారం కలిదిండి జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి అధికారులు తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వంశీ మాట్లాడుతూ నీటి ముంపునకు గురైన 35 కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించినట్లు చెప్పారు. తుపాను నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. తుపాను బాధితులకు భోజనం, వసతి ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు.

రోడ్లు జలమయం

కలిదిండి: మిచాంగ్ తుపాను కారణంగా కలిదిండిలో ప్రధాన రహదారి, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, ఎమ్మార్వో, పోలీస్ కార్యాలయాల ఎదుట, కెనరా బ్యాంక్ రోడ్డు, పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎంపీడీవో దిన తేజ్ కొండంగి గ్రామంలో నీరు నిలిచిన ప్రదేశాలను పరిశీలించారు. నీరు మళ్లించే చర్యలు చేపట్టారు. పడమటపాలెం, కోరుకొల్లు గ్రామాలకు వెళ్లి వర్షపు నీరు మళ్లించి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కలిదిండిలో 57.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసిల్దార్ వంశీ తెలిపారు.



7న ఉత్సవాలపై సమావేశం

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ షష్ఠి ఉత్సవాలకు సంబంధించి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఈ నెల 7న సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ శొంఠి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య మంగళవారం తెలిపారు. ఉత్సవాలు ఈనెల 17 నుంచి 29 వరకు జరుగుతాయి. ఇందుకు సంబంధించి ఏలూరు ఆర్డీవో ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

వేదన మిగిల్చిన మిచాంగ్

- మిచాంగ్ ప్రభావంతో నీటమునిగిన వరి పనలు
- గాలుల తీవ్రతతో నేలవాలిన వరిపైరు

తోట్లవల్లూరు: మిచాంగ్ తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలతో రైతుల గుండెలు వణికిపోతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట వర్షంనీటిలో చిక్కుకుంది. వర్షాలకు తడిసిముద్దైన వరిపంటను ఏం చేయాలో తెలియక రైతులు ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. తుపాను ప్రభావంతో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో పాటు చలితో కూడిన ఈదురుగాలులు వీస్తున్నాయి.

మండలంలో పరిస్థితి ఇదీ..

మండల వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 8 వేల ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేశారు. ఇప్పటి వరకు 3 వేల ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి. 700 ఎకరాల్లో రైతులు వరికుప్పలు వేశారు. 650 ఎకరాల్లో యంత్రాలతో నూర్పిడి పూర్తయ్యింది. యంత్రాల ద్వారా నూర్పిడి చేసిన 370 టన్నుల ధాన్యాన్ని టార్పాలిన్‌లు, పరదాలతో కప్పి ఉంచారు. ఇప్పటి వరకు ఆర్‌బీకేల ద్వారా 1280 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఎంఏవో జి.నాగేశ్వరరావు తెలిపారు.

నీటి ముంపులో వరిపనలు..

వర్షాల కారణంగా రెండు వేల ఎకరాల్లో వరిపైరు నీటి ముంపులో చిక్కుకుంది. వరిపనలు తడిసి ముద్దయ్యాయి. ఈదురుగాలుల కారణంగా చాలా చోట్ల వరి పైరు నేలవాలింది. వరికుప్పల చుట్టూ వర్షం నీరు చేరింది. రెండో పంటగా సాగు చేస్తున్న మినుము కూడా వర్షం కారణంగా దెబ్బతింటుందని రైతులు అంటున్నారు. లంకల్లో సాగు చేస్తున్న అరటి, మిర్చి, బొప్పాయి, పూల తోటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని చెబుతున్నారు.

రోడ్డుపై అడ్డంగా కూలిన చెట్టు

మొవ్వ: మిచాంగ్ ప్రభావంతో మంగళవారం కురిసిన భారీ వర్షానికి, ఈదురు గాలులకు పంట పొలాలు, విద్యుత్ లైన్లు, భారీ వృక్షాలు అతలాకుతలం అయ్యాయి. మొవ్వ మండలంలో మిచాంగ్ తుపాను ప్రజలను, రైతులను తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తోంది. పలు గ్రామాల్లో విద్యుత్ వైర్ల పై చెట్లు పడటం, స్తంభాలు విరిగి పడటంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పంట బోదులు సైతం నిండి పోవటంతో నీటి పారుదల దిగువకు అంతంత మాత్రంగా ప్రవహిస్తోంది. పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోయి రైతులకు నష్టాన్ని చేకూరుస్తోంది. వేగంగా వీస్తున్న గాలులకు భారీ వృక్షాలు నేలకు ఒరిగాయి. మొవ్వ గ్రామం నుంచి కొడాలి రహదారిలో భారీ చెట్లు రోడ్లకు అడ్డంగా పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



మొవ్వలో నీట మునిగిన వరి పనలు

నీటిని బయటకు పంపాలి..

వర్షాలు తగ్గగానే పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపటంతోపాటు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఈఓ కె. లక్ష్మణరావు సూచించారు. పడిపోయిన వరి పనలను పైకిలేపి కట్టాలన్నారు. నీటిలో తడిచిన వరి పనలపై లీటరుకి 5 గ్రాముల చొప్పున ఉప్పును కలిపి పిచికారి చేయాలని చెప్పారు.

అధికారుల పరిశీలన

పామర్రు: మండలంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారి శివనాగరాణి అన్నారు. మండల పరిధిలో నీట మునిగిన పొలాలను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కోతలు కోసినధాన్యం తక్షణమే సమీపంలో ఉన్న రైస్ మిల్లులకు ఆఫ్‌లైన్‌లో దిగుమతి చేసుకోవాలన్నారు. కోసిన వరి పనలను రక్షించుకోవాలని అన్నారు. ఎలకుర్రు గ్రామంలోని తుపాను పొలాలను గ్రామ సర్పంచ్ పానే శివమస్తాన్‌రావు పరిశీలించారు. రైతులను ఆదుకుంటామన్నారు.

పొలాలను పరిశీలించిన ఎంపీపీ, జెడ్పీటీసీ

గుడివాడరూరల్: వర్షంతో పంట నష్టపోయిన ప్రతి ఒక్క రైతును వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంపీపీ గద్దే పుష్పరాణి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ పేర్కొన్నారు. రెండురోజులు తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను మంగళవారం ఎంపీపీ గద్దే పుష్పరాణి, విక్టర్‌లు పరిశీలించారు. మండలంలోని చౌటపల్లి, వేల్పూరు సిద్ధాంతం, శేరీదింటకుర్రు, దొండపాడు, మోటూరు తదితర గ్రామాల్లో వర్షంతో నీటమునిగిన వరి పంటల పొలాలను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. వారు మాట్లాడుతూ నీట మునిగిన పంట పొలాల్లో నీరు బయటకు వెళ్లేందుకు ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆధ్వర్యంలో రైతులకు అన్ని విధాలు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారని భరోసా కల్పించారు. ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులు పంట నష్ట అంచాలను రూపొందిస్తున్నారని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గద్దే వెంకట రామాంజనేయులు (రాము), కార్యకర్తలు, అభిమానులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పల్లపు ప్రాంతాలు జలమయం

పామర్రు: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మంగళవారం పలుప్రాంతాలు జలమయంగా మారాయి. గ్రామంలోని గఫార్‌సెంటర్, యలమర్రు రోడ్డు, బాపూజీపేట, అరండాల్‌పేట, చౌదరిపేట, విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిలోవర్షపునీరు నిల్వఉండటంతో రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యారు. తహసీల్దార్ కార్యాయం ఆవరణ వర్షపునీటితో నిండిపోవడంతో అవస్థలు పడ్డారు. బస్టాండ్ ఆవరణ చెరువును తలపించేలా మారింది. పామర్రు, చల్లపల్లి రహదారిలో చెట్టు కొమ్మ విరిగిపోవడంతో రహదారిపై ఇబ్బందులు పడ్డారు. స్పందించిన అధికారులు కొమ్మను తొలగించారు.

గుడివాడ నియోజకవర్గంలో 14,254 ఎకరాల మునక



తటివర్రు, రామనపూడి గ్రామాల్లో నెలకొరిగిన వరిపంట



గుడ్లవల్లేరు మండలంలో నీటిలో నానుతున్న వరి పనలు

గుడివాడరూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గుడివాడ నియోజకవర్గంలో 14,254 ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. నియోజకవర్గంలోని గుడివాడ, గుడ్లవల్లేరు, నందివాడ మండలాల్లో 37,400 ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. రెండురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వరి పైరు, వరిపంట (పనలు) నీటిపాలయ్యాయి. గుడివాడ మండలంలో 15 వేల ఎకరాల్లో వరిసాగు చేయగా 9 వేల ఎకరాలు నీటమునిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. గుడ్లవల్లేరు మండలంలో 21 వేల ఎకరాల వరిసాగు చేయగా 4,416 ఎకరాలు నీట మునిగాయి. నందివాడ మండలంలో 1359 ఎకరాల్లో వరిసాగు చేయగా 848 ఎకరాలు నీట మునిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది..

తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకునేందుకు అన్ని చర్యలు చేపడుతుందని వ్యవసాయశాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి తెలిపారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులతో కలసి మంగళవారం నీటమునిగిన పంట పొలాలను పరిశీలించారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని తెలిపారు. మండల వ్యవసాయశాఖ అధికారి బి.అనంతలక్ష్మి, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

–నిమ్మగడ్డ రమాదేవి, ఏడీఏ



ఎలకుర్రులో నీటమునిగిన పంటపొలాలను పరిశీలిస్తున్న సర్పంచి శివమస్తాన్‌రావు తదితరులు



మొవ్వ రహదారిపై పడిన చెట్లు



తోట్లవల్లూరులో వరికుప్ప రక్షణకు కప్పిన టార్పాలిన్



పామర్రు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో చేరిన వర్షపు నీరు



మోటూరులో నీటమునిగిన వరిపంట పొలాలను పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది

- ఎమ్మెల్యే కైలేఅనిల్‌కుమార్
- నీటమునిగిన పొలాల పరిశీలన

పెదపారుపూడి: మీచాంగ్ తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న వరి పంట పొలాల రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని పెదపారుపూడి గ్రామంలో తుపాను కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, గుడివాడ ఆర్డీవో పద్మావతి మంగళవారం పరిశీలించారు. వరి పంట కోసిన పనలపై ఉండటంతో ఎక్కువగా నష్టంగా జరుగుతుందని రైతులు ఎమ్మెల్యేకు వివరించారు. రెండవ పంటగా చల్లిన మినుము గింజలు పూర్తిగా దెబ్బతినటంతో మరలా మరోసారి గింజలు చల్లాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం రైతుల దగ్గర మినుము విత్తనాలు లేవని ఎమ్మెల్యేకు వివరించారు. మినుముల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి రైతులకు విత్తనాలు సబ్సిడీపై అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. మిషన్‌తో కోసిన ధాన్యాన్ని మిల్లర్లకు పంపించటానికి లారీలు అవసరం ఉందని ఎమ్మెల్యేకు రైతులు మొర పెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే ధాన్యం తొలేందుకు రైతులకు లారీలు వెంటనే ఏర్పాటు చేయాలని తహసీల్దార్ వి.నాగభూషణంను ఆదేశించారు.



పెదపారుపూడిలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ఆర్డీవో పద్మావతి

రైతులకు ఏటు వంటి సాయం కావాలన్నా తనకు ఫోన్ చేస్తే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఆర్డీవో పద్మావతి మాట్లాడుతూ మండల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఎంపీపీ గోగం సురేష్, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, వ్యవసాధికారి ఆంజనేయులు, సచివాలయాల మండల కన్వీనర్ జాజుల చిన్నారి, మండల కన్వీనర్ గోళ్ళ సోమేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు చీకుర్తి వరప్రసాద్, తుమ్మల కోటేశ్వరరావు, జాజుల నాగరాజు, జువ్వనపూడి రాజు, రాఘు, గోళ్ళ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమగ్రాభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి కైకలూరు మండలాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో ఎంపీపీ అడవి కృష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. నియోజకవర్గ ప్రత్యేకాధికారి, ఏలూరు జిల్లా జెడ్పీ సీఈవో సుబ్బారావు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పెంచికలమర్రు పీడబ్ల్యూఎస్ స్కీంకు 20 ఎకరాలు చొప్పున 60 ఎకరాలు మూడు తాగునీటి చెరువులు ఉన్నాయన్నారు. అవి నిరూపయోగంగా ఉంటున్నాయని, కొన్ని ఎకరాలు గ్రామపంచాయతీకి అప్పగిస్తే వాటి ద్వారా ఆదాయం వస్తుందని సీఈవో సుబ్బారావును ఎమ్మెల్యే కోరారు. ఎంపీపీ అడవి కృష్ణ మాట్లాడుతూ అన్ని రంగాల్లో కైకలూరు మండలాన్ని ముందు వరసలో నిలుపుతున్నామన్నారు. ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే డీఎన్నార్ సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు మాట్లాడుతూ గ్రామానికి రక్షిత తాగు నీటి పథకాన్ని కేటాయించాలని కోరారు. కోఆప్సన్ సభ్యుడు శ్యామ్‌సుందర్ భుజబలపట్నం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మించాలని సభ దృష్టికి తీసుకొచ్చాడు. గోపవరం సర్పంచ్ ఉలిసి వసంతకుమారి గ్రామంలో మిచాంగ్ తుపాను కారణంగా పంట దెబ్బతిందని రైతులను ఆదుకోవాలని కోరారు. జెడ్పీటీసీ కురేళ్ళ బేబీ, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, తామరకొల్లు సర్పంచ్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భట్రాజు శివాజీ, తహసీల్దార్ బి.మురళీకృష్ణ, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రకాశరావు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

రైతులను ఆదుకుంటాం : ఎంపీ బాలశౌరి

చిలకలపూడి(మచిలీపట్నం): బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులను ఆదుకునేందుకు అవసరమైతే తాను ప్రధాని నరేంద్రమోదీని కలిసి పరిస్థితిని వివరించి కేంద్ర ప్రభుత్వం తక్షణ సాయం అందేలా కృషి చేస్తానని తెలిపారు. తడిచిన, రంగుమారిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆయన కోరారు. పునరావాస కేంద్రాల్లో మంచి ఆహారం, ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు.

ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు

గుడివాడ టౌన్: మిచాంగ్ తుపాను కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని లోతట్టు ప్రాంతాల సచివాలయాల్లో ఆయన పర్యటించారు. మాట్లాడుతూ రోడ్లపై ఎక్కడా నీరు నిల్వకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే వార్డులో లోతట్టు ప్రాంతాల పరిస్థితులు శానిటరీ కార్యదర్శులకు తెలుసు కనుక వార్డు వలంటీర్లతో సమాచారం రాబట్టి నీరు నిల్వ ఉండకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.కుల సర్వే, ఆడుదాం ఆంధ్రా రిజిస్ట్రేషన్ల వివరాలు తెలుసుకున్నారు.

నీట మునిగిన రహదారులు

మండవల్లి: మండలంలో ఇంగిలిపాకలంక వద్ద ఘంటసాల అచ్చిరాజు చేపల చెరువు వద్ద రెండు చెట్లు కూలిపోవడంతో ఉనికిలి–ఇంగిలిపాకలంకల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోకి వర్షం నీరు చేరి రోగుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండవల్లిలో విజయవాడ–భీమవరం జాతీయ రహదారిపై వర్షం నీరు చేరి వాహనదారులు, పాదాచారులు పలు సమస్యలు ఎదుర్కొన్నారు. స్థానిక కైకలూరు వీధి వర్షం నీటితో నిండి వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈఓపీఆర్డీ బి.ఆనందబాబు మండవల్లిలో డ్రెయినేజీ సమస్య నివారణకు ప్రొక్లెయిన్ ద్వారా చర్యలు తీసుకున్నారు.

రెండు పంటలపైనా..

ముదినేపల్లి రూరల్: తుపాను ప్రభావం రెండు పంటలపైనా పడింది. మండల వ్యాప్తంగా సుమారు 15 వేల ఎకరాల్లో వరిసాగు చేయగా నాలుగో వంతు మాత్రమే కోతలు పూర్తయి ధాన్యం చేతికందివచ్చింది. ముందుగా కోతకు వచ్చే స్వర్ణరకం వరిసాగు చేసిన రైతులు మాసూళ్లు వర్షానికి ముందే పూర్తిచేసుకోగలిగారు. ఆలస్యంగా కోతకు వచ్చే ఎంటీయూ 1318 రకం వరిసాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. రెండో పంటగా మినుము సాగు చేసిన రైతులు సైతం నష్టపోయారు. కోతలు పూర్తయిన మాగాణిలో దుక్కులు దున్ని మినుము విత్తనాలు చల్లారు. ఎకరానికి రూ.4వేలకు పైగా ఈ పంట సాగుకు వ్యయం చేశారు. మొక్క మొలకెత్తిన, మొలకెత్తుతున్న దశలో భారీ వర్షాల వల్ల మినుము పైరు కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది.



స్థానిక కైకలూరు వీధిలో రహదారిపై నిలిచిన వర్షం నీరు

నేలకొరిగిన 42 విద్యుత్ స్తంభాలు

కైకలూరు: ఈదరుగాలులకు నియోజకవర్గంలో 42 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మంగళవారం 136.2 మిల్లీమీటర్ల వర్షపాతం కైకలూరులో నమోదయ్యింది. పామర్రు – దిగమర్రు జాతీయ రహదారిలో ఆటపాక శివారు నాగపురం వద్ద చెట్టు నేలకొరిగింది. ఎంపీపీ, తహసీల్దారు, తలారి జాన్ ప్రొక్లయిన్‌లతో చెట్టును తొలగింపచేశారు. రాచపట్నం, గోపవరం గ్రామాల్లో 200 ఎకరాల్లో వరి పంట నీటమునిగి కిందకు ఒరిగింది. ఏలూరు జిల్లా జెడ్పీ సీఈవో సుబ్బారావు, ఎంపీపీ అడవి కృష్ణ, తహసీల్దారు మురళీకృష్ణ, ఏవో దివ్య, సర్పంచ్ వసంతకుమారి మునిగిన పంటలను పరిశీలించారు. కైకలూరు వెలంపేట, పల్లెవాడ, సోమేశ్వరం కాలనీ, కైకలూరు టౌన్‌హాలు వద్ద భారీగా వర్షపు నీరు చేరింది. విద్యుత్‌శాఖ పరంగా నియోజకవర్గం నాలుగు మండలాల్లో దాదాపు 42 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అనేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది



గోపవరంలో పంటను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో సుబ్బారావు, ఎంపీపీ

వర్షపు నీటిని తొలగించండి..

ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) వెలంపేట కాలనీలో వర్షపు నీరు చేరిన ప్రాంతాలను పరిశీలించారు. నీటిని బయటకు పంపించే డ్రెయిన్లలో చెత్తను వెంటనే తొలగించాలన్నారు. తుపాను నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

డ్రెయిన్లలో పూడిక తీత

ముదినేపల్లి రూరల్: స్థానిక పంచాయతీ పరిధిలో వర్షపునీరు నిల్వలేకుండా పంచాయతీ ఆధ్వర్యంలో రక్షణ చర్యలు చేపట్టారు. ముదినేపల్లి సెంటర్లో 165వ నంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. దీనివల్ల డ్రెయిన్లు మరమ్మతులకు గురికావడంతో మురుగునీరు వర్షపునీరు ఎక్కడికక్కడే నిలిచిపోతుంది. ఈ నీటిని తరలించేందుకు డ్రెయిన్ల పూడిక తీత పనులను మంగళవారం ప్రారంభించారు. తహసీల్దార్ కే శ్రీనివాస్, ఎంపీడీవో పీ మల్లీశ్వరి, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ ఈ పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. పంచాయతీ పరిధిలో నీరు నిల్వ లేకుండా డ్రెయిన్లు సజావుగా ప్రవహించేందుకు చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత నిమ్మగడ్డ భిక్షాలు, పంచాయతీ కార్యదర్శి యార్లగడ్డ శ్యాంప్రసాద్ డ్రెయిన్ల పనులను పరిశీలించినవారిలో ఉన్నారు.

పులపర్రులో..

మండవల్లి: పులపర్రులో డ్రెయిన్ పనులను ఈఓపీఆర్డీ బి.ఆనందబాబు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. డ్రెయిన్ సక్రమంగా లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతుండటంతో జేసీబీతో నీరు పారుదల జరిగేలాచర్యలు తీసుకున్నారు. సర్పంచ్ వేంద్ర నాగరాజు, కార్యదర్శి పి.రత్నకుమారి, సిబ్బంది ఎ.శ్యాంబాబు పాల్గొన్నారు.



డ్రెయిన్ల పూడికతీత పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

మురుగు పారుదలకు చర్యలు



మండవల్లిలో జేసీబీతో డ్రెయిన్లలో పూడిక తీయిస్తున్న సిబ్బంది

మండవల్లి: మండవల్లిలో స్థానిక సెంటర్, ఎస్సీ ఏరియా, స్టేషన్‌రోడ్, కైకలూరు వీధి తదితర ప్రాంతాల్లో సర్పంచ్ మెండా ఝాన్సీ పర్యవేక్షణలో మంగళవారం డ్రెయిన్లు బాగుచేయించారు. రహదారులపై నీరు బయటకు తరలించే ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్, వార్డు సభ్యులు పసుపులేటి నాంచారయ్య, కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్వో కమలహాసన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.